**కొందరు సినిమాల్లో పూర్తిగా లీనమవుతుంటారు. అందులో హీరోయిన్లకు వచ్చే కష్టాలను.. తమవిగానే భావిస్తారు. 'అయ్యో! రాత.. నాకూ గిట్లనే అయింది. నా బతుకు గిట్లనే ఆగం అయింది!' అంటూ థియేటర్లలోనే శోకాలు పెడుతుంటారు. చిన్నప్పుడు మాకూ అలా అతిచేసే ఓ క్యారెక్టర్ పరిచయమైంది. ఆమెతోపాటు మేమూ 'సినిమా' కష్టాలు పడాల్సి వచ్చేది.**

# అతి అనసూయ - 1

అప్పట్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసు అనేవారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కుట్లు – అల్లికలు లాంటివి నేర్పడానికి.. అందులో ప్రత్యేకంగా ఒక మహిళా ఉద్యోగి ఉండేది. ఔట్ సోర్సింగ్ పర్సన్ అన్నమాట. కాకపోతే 'కుట్టు టీచర్' అనేవారు. ఆమెకు నెలకు ఇంత అని కన్సాలిడేటెడ్ పేమెంట్ చేసేవారు. మా మేనత్త భర్త (తర్వాతి కాలంలో మా మామగారు).. బీడీవోలో పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పనిచేసేవారు. ఇలాంటి ఉద్యోగుల సూపర్ విజన్.. ఆయన విధుల్లో భాగం. మా అత్తయ్యకు పబ్లిక్ రిలేషన్స్ (పీఆర్) చాలా ఎక్కువ. ఎప్పుడూ ఇంట్లో ఆ చుట్టుపక్కల ఆడవాళ్లు చాలామంది ఆమె చుట్టూ కూర్చుని, కబుర్లు చెబుతూ ఉండేవారు. ఆమె కూడా కావాల్సిన వాళ్లకు తోచిన సహాయం చేస్తూ ఉండేది. వారిలో అవసరం, శ్రద్ధా ఉన్నవారిని ఓ బ్యాచ్‌గా చేసి.. కుట్టు పని నేర్పితే బావుంటుందని బహుశా మామయ్య సలహా ఇచ్చారేమో! వెంటనే ఓ బ్యాచ్ తయారు కావడం.. వారికి శిక్షణ ఇవ్వడానికి మా అత్తయ్య దగ్గరికి ఓ కుట్టు టీచర్ రావడం చకచకా జరిగిపోయింది. ఆ టీచర్ పేరు అనసూయ. ఊరు మాకు దగ్గర్లోని వెంకటాద్రిపేట.

అలా వచ్చిన ఆవిడ మా అత్తయ్య ఆదరణ వల్ల.. తరచూ రావడం, రోజులకొద్దీ వాళ్లింట్లోనే ఉండిపోవడం జరిగేది. అత్తయ్యను 'అత్తమ్మా!' అనీ, మామయ్యను 'మామయ్యా!' అని పిలిచేటంత చనువు పెరిగింది. అంతేకాదు.. మా అమ్మను 'అమ్మా!' అనీ, నాన్నను 'బాపూ!' అనీ పిలిచేది. మేం అత్తయ్య మేనకోడళ్లం కాబట్టి.. మమ్మల్ని చెల్లెళ్లుగా భావించేది. కానీ, అంత పెద్దావిడను అక్కగా స్వీకరించడానికి మేం అప్పటికి సిద్ధంగా లేము. మా రెండిళ్లలో ఎవరి బంధువులనైనా.. మా వరుసలతోనే పిలిచేది. స్వతహాగా ఆవిడ మంచిది. మా అందరి కోసం పల్లిపట్టీలు, చాక్లెట్లు కొనుక్కొచ్చేది.

రానురానూ మా అత్తయ్య వాళ్లింట్లో అనసూయ ఓ భాగమైపోయింది. వాళ్ల ఊరికి వెళ్లి వస్తూ ఉండేది. ఇక్కడ ఇల్లు అద్దెకు తీసుకుంటే కిరాయి, వంట వండుకోవడం.. చిన్న జీతంలో కష్టమని కాబోలు, అత్తయ్య వాళ్లింట్లోనే ఉండేది. తరువాతి రోజుల్లో మా ఇంట్లో కూడా ఒక సందుక తెచ్చుకుని ఉండేది.

ఆమెకు సినిమాలంటే మహా ఇష్టం! పిల్లలమంతా సినిమాకు వెళ్తే.. ఎలాగో తెలుసుకుని మాతోపాటే వచ్చేది. ఓసారి మేమంతా మా ఊరి జయలక్ష్మి నరసింహ టాకీస్‌లో 'ముత్యాలముగ్గు' సినిమాకు వెళ్లాం. సినిమా మొదలైంది. పాటలూ, రావు గోపాలరావు డైలాగ్స్.. అంతా ఆనందంగా చూస్తున్నాం. ఇంతలో హీరోయిన్‌పైన కుట్ర మొదలై.. సంగీత పడగ్గదిలోకి దూరి అలమారలో దాక్కున్నాడు నూతన్‌ప్రసాద్. అప్పుడే శ్రీధర్ అనుమానంతో మొహం అంతా చిట్లించి.. దూరం నుంచి నడిచి వస్తున్నాడు. డోర్ దగ్గరికి వచ్చి.. తలుపు తెరిచాడు. అంతే!! మా పక్కన కూర్చున్న అనసూయ.. ఒక్కసారిగా రాగం అందుకుంది. ''అయ్యో! నా బతుకు గిట్లనే అయింది. నన్ను గూడ గిట్లనే చేసిన్రు. మేమిద్దరం మంచిగుంటె మా ఆడిబిడ్డ ఓర్వలే! మా ఆయనకు లేనిపోని మాటలు చెప్పి.. మమ్ములను గిట్లనే ఇడదీశింది. లోకంల మంచోళ్లను జూస్తె ఓర్వరు. అయ్యో! ఎంత పనైపోయింది! బిడ్డవు తెలివి లేకుండ ఇరుక్కుంటివి. మొగోల్లదేముంటది.. తల కాయ లేని సన్నాసులుంటరు. ఏది జెప్తె గదే నమ్ముతరు. ఆగమై పోతివి గద బిడ్డో!'' అంటూ పెద్దగా ఏడుస్తూ.. మరో సైడ్‌షో మొదలుపెట్టింది. వెనక వాళ్లు, పక్క వాళ్లు ఏమైందోనని చూడటం, ముందు వరసల వాళ్లు తలలు వెనక్కి తిప్పి చూడటం మొదలైంది. ''ఏమైందట? ఎందుకేడుస్తున్నది?!'' అని ఒకర్నొకరు అడగడం.. ''పాపం! అంబేద మనుసున్నట్టుంది. హీరోయిన్‌కు కష్ట మొచ్చిందని ఏడుస్తాంది'' అంటూ వాళ్లల్లో వాళ్లు జవాబిచ్చుకోవడం జరిగింది. ''ఇగ ఊకో అమ్మ.. ఊకో! తగని కట్టమే ఒచ్చింది. ఏం జేస్తం మరి?'' అంటూ కొందరు ఓదారిస్తే.. మరి కొందరు మాత్రం 'ఏమిటి గొడవ?' అన్నట్టు విసుగ్గా మా వైపు చూడటం మొదలు పెట్టారు. ఒకరిద్దరు.. ''అమ్మాయీ! గీమె ఎవ్వలు? మీ సుట్టాల లెక్క లేరు గద! ఏమైంది?! మొగడు ఒదిలి పెట్టిండా?!'' అని అడుగుతుంటే.. మాకు నిజంగా ఏమీ తెలియక, ఏం జవాబు చెప్పాలో తోచక బిక్కమొహాలు వేసేవాళ్లం. అలా సినిమా పేరుతో కానీ, హీరోయిన్‌తో కానీ సంబంధం లేకుండా.. ఏ సినిమా అయినా సరే, ఆ కష్టాలన్నీ తన జీవితంలోలానే ఉన్నాయంటూ పోల్చుకునేది అనసూయ. హీరోయిన్‌కి కష్టం వస్తే చాలు.. అది ఎలాంటి కష్టమైనా సరే, ''అయ్యో రాత! నాకు గిట్లనే అయింది. నా బతుకు గిట్లనే ఆగం అయింది'' అనేది. 'అన్ని రకాల కష్టాలూ ఈమెకే రావడం ఎలా?' అనే లాజిక్ నా బుర్రకు తోచేది కానీ, ఆమెను అడిగేదాన్ని కాదు. అసలే ఆ థియేటర్‌లో ఘోరమైన వేడి, దానికి తోడు బీడీల కంపు. పైగా అనసూయ టార్చర్‌తో మాకు సినిమా చూడాలన్న ఉత్సాహమే చచ్చిపోయేది. చివరికి ఆమెను బుజ్జగించి హాల్లోంచి బయటికి తీసుకెళ్లి.. మొహం కడుక్కోమని చెప్పి, మళ్లీ లోపలికి తీసుకొచ్చి కూర్చో పెట్టేటప్పటికి.. మా వాళ్లకు తల ప్రాణం తోకకు వచ్చేది.

అప్పటినుంచి మేము సినిమాకు వెళ్లాలని ప్లాన్ చేస్తే.. ఆవిడ ఆ చుట్టుపక్కల లేకుండా చూసేవాళ్లం. అయితే కొన్నిసార్లు మా బుజ్జిని(పద్మ ).. ''నేనే టిక్కెట్లు కొంటా గానీ, సినిమాకు పోదామా!'' అని టెంప్ట్ చేసేది. పద్మ పడిపోయి.. ఆమెతో సినిమాకు వెళ్లి, మరిన్ని కష్టాలు పడేది. ■






నెల్లుట్ల రమాదేవి
రచయిత్రి